క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కర్రెమ్మ బోనాలు



మక్తల్: మండలంలోని మాద్వార్‌లోమంగళవారం కర్రెమ్మ బోనాల ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పోలీసు ముకుందారెడ్డి ఇంటి నుంచి బోనాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి.. మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆర్మీకి ఎంపికైన యువకులకు సన్మానం



నారాయణపేట రూరల్: మండలంలోని అభంగాపూర్‌కు చెందిన లక్ష్మీకాంత్, ఎండీ రెహమాన్‌పాషా ఇటీవల ఆర్మీకి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఎల్లమ్మ కాలనీ పెద్దలు ఇరువురు యువకులను మంగళవారం శాలువాతో సన్మానించి అభినందించారు. దేశ సేవకై నడుం బిగించి ముందుకు రావడం ప్రశంసనీయమన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకుని యువత దేశ రక్షణకు ముందుకు రావాలని కోరారు.

ఘనంగా హజ్రత్ ఫకీర్‌పాషా గంధోత్సవం



మద్దూరు: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని రెనివట్ల శివారులో హజ్రత్ ఫకీర్‌పాషా గంధోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. రెనివట్లకు చెందిన ముస్లింలు హజ్రత్ ఫకీర్‌పాషా గంధం ఊరేగింపు నిర్వహించిన అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉత్సవాల సందర్భంగా పలువురు గ్యార్మీలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



మద్దూరు: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. ఎస్ఐ విజయకుమార్ వివరాల మేరకు.. మండలంలోని భూనీడ్ వాగు నుంచి మంగళవారం ఇసుకను ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తుండగా.. పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమాని మొగులప్పపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం

మరికల్: మండల కేంద్రంలోని హరిజనవాడలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులకు మంగళవారం ఎమ్మెల్యే చిట్టి పర్ణికారెడ్డి ప్రారంభించారు. డ్రెయినేజీ పనులను నాణ్యతగా చేపట్టి, త్వరగా పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సూర్యమోహన్ రెడ్డి, కృష్ణయ్య, హరీశ్, రాజమణెమ్మ, రాములు, రామకృష్ణ, తిర్మలయ్య, జయసింహారెడ్డి, రఘు, ఆంజనేయులు, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



నారాయణపేట రూరల్: రేషన్ బియ్యం అక్రమ రవాణాను పోలీసులు అడ్డుకున్నారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. మండలంలోని జలాల్‌పూర్‌కు చెందిన తెలుగు హనుమంతు సమీప గ్రామాల నుంచి రేషన్ బియ్యం సేకరిస్తాడు. ఈ క్రమంలో మంగళవారం 29 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని కర్ణాటకకు అక్రమంగా తరలించేందుకు ఆటోలోకి ఎక్కించాడు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గ్రామానికి చేరుకొని రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. రెవెన్యూ అధికారుల పంచనామా అనంతరం కేసు నమోదు చేసి బియ్యాన్ని సీజ్ చేశారు.

యూనిఫాం తయారీకి సిద్ధం



పాఠశాలల వారీగా క్లాత్ పంపిణీ చేస్తున్న అధికారులు



- దామరగిద్దకు చేరిన యూనిఫాం క్లాత్
- పాఠశాలల వారీగా పంపిణీ చేస్తున్న అధికారులు
- మహిళా సంఘాల సభ్యులకు తయారీ బాధ్యత

దామరగిద్ద: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 2025–26 విద్యా సంవత్సరం ప్రారంభం రోజున యూనిఫాం అందించేందుకు రాష్ట్ర విద్యాశాఖ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా యూనిఫాం తయారీ బాధ్యతను స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు అప్పగించింది. ఇప్పటికే యూనిఫాం తయారీకి అవసరమైన క్లాత్‌ను సరఫరా చేయగా.. దామరగిద్ద మండలంలో పాఠశాలల వారీగా విద్యార్థులకు అవసరమైన క్లాత్‌ను అధికారులు పంపిణీ చేశారు. విద్యార్థులకు యూనిఫాం దుస్తులు సకాలంలో తయారు చేయించేందుకు పక్కా ప్రణాళిక రూపొందించారు.

చర్యలు తీసుకుంటున్నాం..



మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 1నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మొదట ఒక జత యూనిఫాం తయారు చేయాలని అధికారులు ఆదేశించారు. యూనిఫాం తయారీకి అవసరమైన క్లాత్ అందించారు. ఈఏడాది 50 స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు క్లాత్ సరఫరా చేసి.. యూనిఫాం దుస్తుల తయారీకి చర్యలు తీసుకుంటున్నాం.

– నర్సింహులు, ఏపీఎం



దామరగిద్ద ఎమ్మార్సీ భవనానికి చేరిన యూనిఫాం క్లాత్

5,451 మంది విద్యార్థులు..

మండలంలోని 45 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. 5,451 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి ముందుగా ఒక్కో జత యూనిఫాం అందించనున్నారు. ఇందుకోసం మండలంలో మహిళా స్వశక్తి స్కూల్ యూనిఫాం కుట్టు కేంద్రాలను ఏర్పాటుచేసి.. టైలరింగ్ వచ్చిన మహిళా సంఘాలతో యూనిఫాం తయారీకి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో కాంట్రాక్ట్ పద్ధతిన యూనిఫాం కుట్టించే పద్ధతికి స్వస్తి పలికారు. గతేడాది డీఆర్డీఓ ద్వారా మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో 80 మహిళా సంఘాల్లోని 113 మంది సభ్యులతో యూనిఫాం కుట్టించి ఉపాధి కల్పించారు. ఈ ఏడాది సైతం విద్యార్థులకు యూనిఫాం సిద్ధం చేసే దిశగా చర్యలు చేపట్టారు. ప్రభుత్వం మహిళా సంఘాలకు ఉపాధి కల్పించేందుకు విద్యార్థుల యూనిఫాం తయారీ బాధ్యతను అప్పగించడంపై పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు కాగా, గతేడాది ఒక్కో జతకు రూ. 75 చెల్లించారని.. ఈ ఏడాది కూలి రేటు పెంచాలని కోరుతున్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మరికల్‌లో రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

దామరగిద్ద/మరికల్/ధన్వాడ: రాష్ట్ర ప్రభుత్వం పేదల కడుపు నింపేందుకు రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తుందని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. మంగళవారం దామరగిద్ద, మరికల్, ధన్వాడ మండల కేంద్రాల్లో రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలందరికీ నాణ్యమైన బియ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందులో భాగంగా దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. గతంలో నాణ్యత లేని దొడ్డు బియ్యం తినలేక అమ్ముకునే పరిస్థితి ఉండేదన్నారు. సన్న బియ్యం పథకం శాశ్వతంగా ఉంటుందని తెలిపారు. ప్రతి పేద కుటుంబం సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఈదప్ప, తహసీల్దార్ సింధూజ, డీఎం సైదులు, డీటీ ఆనంద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బాల్‌రెడ్డి, నరహరి, డీలర్లు జనార్దన్, తిరుపతిరెడ్డి, కుపేందర్, నాయకులు ఖాజా, శ్రీనివాస్, హరికృష్ణ, వెంకట్రామారెడ్డి, రఘు, సూర్యమోహన్‌రెడ్డి, వీరన్న, హరీష్, కృష్ణయ్య, రామకృష్ణ, రామకృష్ణారెడ్డి, ఆంజనేయులు, సత్యన్న పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూములు అమ్మొద్దు



మాగనూర్ పోలీస్‌స్టేషన్‌లో నిరసన వ్యక్తంచేస్తున్న నాయకులు

మాగనూర్/మద్దూరు/నర్వ: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను విక్రయించే ప్రయత్నాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పుంజనూర్ ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులను మాగనూర్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు, సంపదను కార్పొరేట్ బడా కంపెనీలకు అప్పజెప్పే విధానాన్ని మానుకోవాలన్నారు. ప్రభుత్వాలు యూనివర్సిటీల బలోపేతానికి పనిచేయాల్సింది పోయి.. బలహీనపరిచే విధంగా చర్యలు చేపట్టడం సిగ్గుచేటని విమర్శించారు. 2వేల ఎకరాలకు పైగా ఉన్న హెచ్‌సీయూ భూములను గత ప్రభుత్వాలు అమ్ముకోవడం వల్ల ప్రస్తుతం 1500 ఎకరాల భూమి మాత్రమే మిగిలిందని ఆవేదన వ్యక్తంచేశారు. యూనివర్సిటీ భూములను కాపాడాలని విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమిస్తే.. పోలీసులతో నిర్బంధించడం దారుణమని విమర్శించారు. అరెస్టయిన వారిలో నాయకులు చిన్న నర్సింహ, సురేష్, నయ్యూం ఉన్నారు.

- మద్దూరులో సీపీఎం, బీజేవైఎం నాయకులు అశోక్, హన్మంతు, భరత్, రాఘవేందర్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వం హెచ్‌సీయూ భూములను అమ్మడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు వారు తెలిపారు.
- ప్రభుత్వం ఎస్ఎఫ్ఐ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామ్యమని జిల్లా ఉపాధ్యక్షుడు కేఎం మహేందర్ అన్నారు. నర్వ పోలీసులు ఎస్ఎఫ్ఐ నాయకులు మహేందర్, రాఘవేందర్ తదితరులను ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

ఉపాధి హామీ కూలీలకు నీడ కరువు

కొత్తపల్లి: ఉపాధి హామీ పథకం పనులు చేపట్టే ప్రాంతాల్లో నీడ వసతి లేక కూలీలు అల్లాడుతున్నారు. వేసవిలో కూలీలకు కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. కొన్ని రోజులుగా 38 నుంచి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు కావడం .. కూలీలకు నీడ సౌకర్యం కల్పించక పోవడంతో వడదెబ్బ బారిన పడుతున్నారు. ఉమ్మడి మద్దూరు మండలంలో 2,100 మంది కూలీలు 85 పాంపాండ్స్ నిర్మాణాలు, గట్లపై వాలు కట్టలు తదితర పనులు చేపడుతున్నారు. అయితే పని ప్రదేశాల్లో నీడ పందిళ్ల లేకపోవడంతో ఎండలోనే పనులు చేస్తున్నారు. సంబంధిత అధికారులు వచ్చి పనులను చూస్తున్నారు తప్ప.. కూలీలకు కనీస వసతులైన నీడ సౌకర్యం, మంచినీరు, ఓఆర్ఎస్ పాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు చేయడంలో శ్రద్ధ చూపడం లేదని కూలీలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధి హామీ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.



గోకుల్‌నగర్ శివారులో ఎండలోనే పనులు చేస్తున్న కూలీలు

ఉత్సాహంగా ఎడ్లబండ్ల గిరక పోటీలు



మరికల్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని ఎలిగండ్లలో మంగళవారం ఎడ్లబండ్ల గిరక పోటీలు నిర్వహించారు. సమీప గ్రామాలకు చెందిన రైతులు 15 జతల ఎడ్లతో పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు సూర్యచంద్ర ఫౌండేషన్ అధినేత సూర్యమోహన్‌రెడ్డి మొదటి విజేత 10 తులాల వెండి, రెండవ విజేతకు 5 తులాలు, మూడవ విజేతకు 3 తులాల వెండిని అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు హరీశ్, చిన్నబాలు, చంద్రారాయుడు, హన్మంతు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ దేవర్లు



అమరచింత: మండలంలోని ధర్మాపురం గ్రామంలో మంగళవారం ఎల్లమ్మతల్లి దేవత ద్యావర్లను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి రెండేళ్లకోసారి ఒక పర్యాయం నిర్వహించే ఎల్లమ్మ దేవర్లకు వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామస్తులు తమ ఇంటి దైవాన్ని పూజించడానికి గ్రామానికి చేరుకున్నారు. ఇంటింటికో పాటేళ్లను బలిచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. వేపాకు చీరలను కట్టి అమ్మవారి బోనంతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించి గుడి వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. పిల్లాపాపలతో సహా ప్రతి ఒక్కరు బండారు (పసుపు)ను చల్లుకుని అమ్మవారి దీవెనలు అందుకున్నారు. దేవర్లతో గ్రామంలో సందడి నెలకొంది.

దోషులను కఠినంగా శిక్షించాలి

మహబూబ్ నగర్ న్యూటౌన్: ఊరుకొండపేటలో మహిళపై లైంగికదాడి చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ చౌరస్తాలో ప్ల కార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించి మహిళలకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. ఐద్వా జిల్లా నాయకురాలు విపద్మ మాట్లాడుతూ రోజురోజుకు మహిళలపై అత్యాచారాలు దాడులు పెరిగిపోతూనే ఉన్నాయన్నారు. మహిళపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వరద గాలి అన్న, పట్టణ నాయకులు లక్ష్మయ్య, సీఐటీయూ, భవన నిర్మాణ కార్మిక సంఘం, ఐద్వా, ఆవాజ్, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, ఉద్యమకారుల సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ఎడివెల్లిలో ప్రత్యేక అలంకరణలో స్వామివారి మూలవిరాట్

ఊట్కూరు: మండలంలోని ఎడివెల్లి శివారులో వెలసిన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం పల్లకీ సేవ, ఆదివారం సాయంత్రం రథోత్సవం, సోమవారం సత్యనారాయణస్వామి వ్రతాలు, డోలారోహణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గాండ్ల మల్లేష్, నర్సింహ, మల్‌రెడ్డి, శంకరన్న, రాజు పాల్గొన్నారు.



ధన్వాడలో కరపత్రాలను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

5 నుంచి ధన్వాడలో వెంకన్న ఉత్సవాలు

ధన్వాడ: మండల కేంద్రంలో వెలసిన శ్రీవేంకటేశ్వర స్వామి ఉత్సవాలను ఈ నెల 5 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం ఆలయ ప్రాంగణంలో నిర్వాహకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీరామ నవమిని పురస్కరించుకొని శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవాలను ఏడు రోజుల పాటు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన వసతులు కల్పించనున్నట్లు చెప్పారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

కోస్గి/మద్దూరు: జిల్లా కేంద్రంలోని మెట్రో ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 5న నిర్వహించే గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర రెండవ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహులు కోరారు. ఈ మేరకు మంగళవారం గుండుమాల్ మండల కేంద్రం, మద్దూరు మండలం దోరేపల్లిలో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. పోరాటం చేస్తే తప్ప కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. కార్మికుల సమస్యల సాధన కోసం నిర్వహించే రాష్ట్ర మహాసభలో పంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమాల్లో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాములు, నాయకులు వెంకటయ్య, తిరుమలయ్య, మొగులయ్య, కిష్టయ్య, పెద్ద వెంకటయ్య, సురేష్, మౌలానా, మాసప్ప, రాములు, వెంకటయ్య పాల్గొన్నారు.



దోరేపల్లిలో పోస్టర్లు విడుదల చేస్తున్న జీపీ కార్మిక సంఘం నాయకులు

తాగునీటి కోసం రోడ్డెక్కిన గ్రామస్తులు



ధర్నా చేస్తున్న ఉప్పర్‌పల్లి గ్రామస్తులు

మక్తల్: మండలంలోని ఉప్పర్‌పల్లిలో తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గ్రామస్తులు రోడ్డెక్కారు. ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామానికి తాగునీటిని అందించే విద్యుత్ బోరుమోటారు కాలిపోవడంతో సమస్య ఏర్పడిందన్నారు. ఓవైపు మిషన్ భగీరథ నీరు రాక.. మరోవైపు విద్యుత్ బోరుమోటారుకు మరమ్మతు చేయించక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వ్యవసాయ పొలాలకు వెళ్లి తాగునీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి.. ఉప్పర్‌పల్లిలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

కార్మికుల సంక్షేమంపై నిర్లక్ష్యం తగదు

ఊట్కూరు: రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాల అమలుపై నిర్లక్ష్యం వహించడం తగదని ఆ సంఘం నాయకుడు సలీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సంక్షేమ పథకాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తు జరిగిన మరణాలకు సంబంధించిన దరఖాస్తులతో పాటు ప్రసూతి, పెళ్లి కానుక దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచడం తగదన్నారు. కార్మికశాఖ ద్వారా సంక్షేమ పథకాల అమలును వేగవంతం చేయాలని కోరారు. అనంతరం పెండింగ్ దరఖాస్తులతో నిరసన వ్యక్తం చేశారు. సమావేశంలో సంఘం నాయకులు చెన్నప్ప, అంజప్ప, లక్ష్మారెడ్డి, నగేష్, నరేష్ తదితరులు ఉన్నారు.



పెండింగ్ దరఖాస్తులను చూపుతున్న కార్మికులు

లేబర్ కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలి



ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న మహిళా స్వీపర్లకు శ్రమ దోపిడీ నుంచి విముక్తి కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరాం డిమాండ్ చేశారు. మంగళవారం నారాయణపేట ఆర్టీసీ డిపో, బస్టాండ్‌లో పనిచేస్తున్న మహిళా స్వీపర్లు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డీఎం లావణ్యను కలిసి వినతిపత్రం అందించారు. వీరికి మద్దతుగా సీఐటీయూ నాయకులు హాజరై మాట్లాడుతూ.. ఆర్టీసీకి పెద్దఎత్తున టెండర్లు వేసి స్వీపింగ్ కాంట్రాక్ట్‌ను దక్కించుకున్న వారు ఔట్ సోర్సింగ్ విధానంలో నియమించుకున్న మహిళా కార్మికులకు చాలీచాలని వేతనాలు ఇస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. కాంట్రాక్టర్ తక్కువ వేతనం ఇవ్వడంతో పాటు ఎక్కువ పని గంటలు డ్యూటీ చేయిస్తున్నాడని.. కార్మికుల ఖాతాలో పీఎఫ్ జమ చేయడంపై అనుమానాలు ఉన్నాయన్నారు. వేతనాలను పెంచి వారి కుటుంబాలను ఆదుకునే విధంగా కాంట్రాక్టర్‌కు సూచించాలని.. లేకపోతే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటమ్మ, సుశీలమ్మ, కిష్టమ్మ, గోవిందమ్మ, కాశమ్మ, భాగ్య, భీమమ్మ, బసమ్మ, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు బారికేడ్ల ఏర్పాటు

మాగనూర్: మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో రోడ్డు ప్రమాదాల నివారణకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. మాగనూర్‌కు చెందిన వాసవీ కిరాణం యజమాని రాంగోపాల్‌శెట్టి రూ. 75వేలతో ఆరు బారికేడ్లను మంగళవారం స్థానిక పోలీసులకు అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అశోక్‌బాబు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలన్నారు. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. ప్రధాన రహదారిపై బారికేడ్ల ఏర్పాటుతో వాహనాల వేగాన్ని నియంత్రించి.. ప్రమాదాలు జరగకుండా చూడవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ అర్జున్, రైటర్ నిలయ్య, హోంగార్డు తిరుపతిరెడ్డి, గ్రామ పెద్దలు కృష్ణయ్య, వెంకటయ్య, వాబయ్య, నర్సప్ప పాల్గొన్నారు.



బారికేడ్లు ఏర్పాటు చేయిస్తున్న ఎస్ఐ అశోక్‌బాబు